నా దగ్గర సాయం చేసే గుణముంది

● చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): నా దగ్గర ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల దగ్గర ఉన్నంత డబ్బు లేకపోవచ్చు.. కానీ అడిగిన వారికి సాయం చేసే గుణం ఉంది.. అని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ చౌరస్తా నుంచి ప్రశాంతిహిల్స్ మీదుగా నందిహిల్స్ వరకు రోడ్ షో నిర్వహించి, అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో తాను ఎంపీగా, తీగల ఎమ్మెల్యేగా ఉండి మీర్‌పేట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని, తనను మరోసారి గెలిపిస్తే మున్ముందు మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన అన్నారు. ఇక్కడి సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థిని కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నదని, తాను నిరంతరం అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంటానని, తన వద్దకు వచ్చిన వారిని ఆదుకుంటానని రంజిత్‌రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించి మరోసారి అభివృద్ధి చేసే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మీర్‌పేట్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

హస్తం గుర్తుకు ఓటేసి అభివృద్ధికి సహకరించండి

సరూర్‌నగర్: చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న గడ్డం రంజిత్‌రెడ్డిని హస్తం గుర్తుపై ఓటేసి గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఓటర్లను కోరారు. బుధవారం ఆమె బడంగ్‌పేట్ కార్పొరేషన్ 29వ డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద రోజుల కాంగ్రెస్ పాలనను, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనను బేరీజు వేసుకుని ఓటర్లు విజ్ఞతతో వ్యవహరించి మరోసారి కాంగ్రెస్‌ను ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, పార్టీ నాయకులు నందుకుమార్, గట్టు బాలకృష్ణ, నయనాచారి, బాబు, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ 29వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పారిజాతారెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లోని రంగనాయకులకాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. ఆయన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైనమిక్ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకుపోతున్నదని, ఎక్కువ ఎంపీ స్థానాలు గెలిచి కేంద్రంలోనూ ఆయన సత్తా చాటనున్నారని అన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాము, కృష్ణ, మోహన్, కొండల్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, వినోద్, సతీశ్ పాల్గొన్నారు.

తాతా ఇదే చేయి గుర్తు.. జాగ్రత్తగా గుద్దు..!

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ వృద్ధుడికి నమూనా ఈవీఎం చూపించి హస్తం గుర్తుపై ఓటేయాలని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి కోరాడు.



నర్సింహారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కే ఓటు వేయండి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, మే 8(ఆంధ్రజ్యోతి): మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కే ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని ఎంపీగా గెలిపించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వాకర్స్‌కు విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో బుధవారం వాకర్స్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేనంతగా ఎల్బీనగర్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. ఎల్బీనగర్‌లో చాలా పార్కులను అభివృద్ధి చేశామన్నారు. అందులో ప్రియదర్శిని పార్కు ఒకటన్నారు. ఓపెన్‌జిమ్, మూత్రశాలల ఆధునీకరణ పనులు చేశామని తెలిపారు. అందుబాటులో ఉండే రాగిడి లక్ష్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, తోట రాజశేఖర్, భాస్కర్ గంగపుత్ర, జగన్నాథ్‌రెడ్డి, టింకు, ఆశిష్, రవి, శ్రీధర్ పాల్గొన్నారు.



ప్రియదర్శిని పార్కులో వాకర్స్‌తో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



కర్మన్‌ఘాట్‌లోని శుభం ప్యాలెస్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కారుగుర్తుకు ఓటెయ్యండి : ఎమ్మెల్యే

చంపాపేట : కారు గుర్తుకు ఓట్లేసి మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శుభం ప్యాలెస్‌లో బుధవారం డివిజన్‌లోని ఆయా కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ అందరికి ఎల్లవేళలా అందుబాటులో ఉండే రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలను తాను అభివృద్ధి చేసినట్లు, బీఆర్ఎస్ ఎంపీగా లక్ష్మారెడ్డి గెలిస్తే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గజ్జల మధుసూదన్‌రెడ్డి, ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, రవిముదిరాజ్, అంజిరెడ్డి, నాయకులు సదానంద్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

12 నుంచి షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు

వనస్థలిపురం : ఈనెల 12 నుంచి 16వరకు వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని ప్రసిద్ధ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ఆలయ 25వ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పి.ఈశ్వరమ్మ యాదవ్, ప్రధాన కార్యదర్శి జే.రవీంద్రబాబులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా స్వామివారి ఆలయ వార్షికోత్సవాలు భక్తుల సమక్షంలో కనుల పండువగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు పాల్గొని ఆలయ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్



చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్బీనగర్, మే 8(ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయిదు నెలల్లోనే ప్రజలకు సినిమా చూపిస్తోందని మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. బుధవారం సాయంత్రం సరూర్‌నగర్‌లోని ఏఎస్‌గార్డెన్‌లో జరిగిన సమావేశంలో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందన్నారు. కాంగ్రెస్ మోసం చేసిందన్న విషయాన్ని ప్రజలు గ్రహించారని మే 13న కర్రుకాల్చి వాతపెట్టనున్నారని ఆమె చెప్పారు. కాంగ్రెస్ గ్యారెంటీలకు కాలం చెల్లిందన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గుర్తించారని ఆమె చెప్పారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని కోరారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సరూర్‌నగర్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు ఆకుల అరవింద్‌కుమార్, ఇంటూరి అంకిరెడ్డి, సుశీలరెడ్డి, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దర్పలి అశోక్, ప్రజాసమస్యల పరిష్కార సమితి అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఆర్. గోపాల్, రమేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, కేశవరెడ్డి, ఇస్మాయిల్, జహీర్, సలీం, ఉషాగౌడ్, ప్రత్యూష్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, శృతి, సాలెమ్మ, వసంత, శ్వేత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించండి

రాజేంద్రనగర్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న బడుగు, బలహీన వర్గాల నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు వనం శ్రీరాంరెడ్డి కోరారు. కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా బుధవారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్, హుడాకాలనీ పరిసర బస్తీలలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ కోతలు లేవన్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వంలో చిన్నపాటి గాలులకే గంటల తరబడి కరెంట్ కోతలు విధిస్తున్నారని శ్రీరాంరెడ్డి విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ హామీలుగానే మిగిలిపోయాయన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెబుతున్న మాయమాటలకు మోసపోవద్దన్నారు. ప్రచారంలో నాయకులు మహేశ్‌ముదిరాజ్, శివకుమార్, జైహింద్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



హుడా కాలనీలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అత్తాపూర్ డివిజన్ నాయకుడు శ్రీరాంరెడ్డి తదితరులు

బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు పని చేయాలి

● చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు గెలిపించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బీఆర్ఎస్‌కి ప్రజలందరి మద్దతు ఉందన్నారు. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో గెలుస్తారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ప్రజలు నిలుస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలు కచ్చితంగా ఓటు ద్వారా బుద్ధి చెబుతారని చెప్పారు. ప్రజలందరు కారుగుర్తుకు ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభాకర్, మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు శేరి శివారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్‌లు బి. నర్సింహులు, మండల యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, సీనియర్ నాయులు కచిరే వెంకటేశ్, చింటు, మాధవగౌడ్, వెంకటేశ్, కృష్ణ, మహేశ్, వెంకటేశ్, గణేశ్, సత్యం, మాణిక్యరెడ్డి, చందు, పురుషోత్తం, జాఫర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్నబియ్యం అన్నం పెట్టించింది నేనే

● బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

ఘట్‌కేసర్, మే 8: సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థులకు సన్నం బియ్యంతో వండిన అన్నం తిన్నంత పెట్టాలని అందుకోసం నాడు ఆర్థిక శాఖ మంత్రిగా చర్యలు చేపట్టింది తానేనని రాష్ట్ర మాజీ మంత్రి, మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ దివ్యాంగుల కాలనీలో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ తాను సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉండి చదువుకున్నట్లు గుర్తు చేశారు. అప్పట్లో హాస్టళ్లలో పురుగుల అన్నం, నీళ్లచారు ఉండేదని నరకం అంటే ఇదేనేమో అన్నట్లుగా ఉండేదన్నారు. 1978లోనే హాస్టల్‌లో ఇచ్చిన ప్లేటు, గ్లాసుతో నగరంలోని సచివాలయం వద్ద ఆందోళన చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఇబ్బందులు తెలిసిన వ్యక్తిని కనుక ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే అనేక సంస్కరణలు చేపట్టినట్లు వివరించారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రవ్యాప్తంగా తిరిగి పోలీస్‌స్టేషన్లు, జైళ్లలో ఉండాల్సి వచ్చిందన్నారు. కరోనా కష్టకాలంలోనూ ఆరోగ్య శాఖమంత్రిగా అనేక కార్యక్రమాలు చేపట్టి వైద్యులు, సిబ్బందిలో ధైర్యం నింపినట్లు గుర్తుచేశారు. దేశంలో స్వచ్ఛ భారత్ కింద 12కోట్ల ఇళ్లల్లో మరుగుదొడ్లు నిర్మించి మహిళలకు ఆత్మగౌరవం అందించిన వ్యక్తి మోదీ అన్నారు. దేశాన్ని మరింత అభివృద్ధి చేయడానికి బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సురేష్, బాలేష్, బస్వరాజ్, ఉపేందర్, నర్సింహ పాల్గొన్నారు.



పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని దివ్యాంగుల కాలనీలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

పతి గెలుపు కోసం సతి ప్రచారం

ఎల్బీనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి ఈటల జమున బుధవారం సరూర్‌నగర్ ప్రియదర్శినిపార్కులో ప్రచారం చేశారు. పార్కులో వాకర్స్‌ను కలిసి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత కోసం ప్రధాని నరేంద్రమోదీని మరోసారి ప్రధానిగా చేయడం ఎంతో అవసరమన్నారు. ఈటల రాజేందర్‌ను గెలిపించడం ద్వారా మోదీకి మద్దతు పలకాలని ఆమె వాకర్స్‌ను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి, బీజేపీ కుమ్మరి సెల్ కన్వీనర్ మల్కాజిగిరి కుమార్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి బండారు శైలజ, చిలుకూరి రాంరెడ్డి, ప్రియదర్శిని పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రకుమార్, కోశాధికారి చంద్రమౌళి, యోగ శిబిరం అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, నాగరాజు, గుండె కిరణ్, వెంకటేశ్, సురేష్‌చారి, ఎం. ప్రవీణ్ పాల్గొన్నారు.



సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో ప్రచారం చేస్తున్న ఈటల రాజేందర్ సతీమణి జమున

పద్మావతి కాలనీలో బీజేపీ ప్రచారం

హయత్‌నగర్: మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం హయత్‌నగర్ డివిజన్‌లోని పద్మావతికాలనీలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈటల రాజేందర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. ప్రధాని నరేంద్రమోదీని మరోసారి గెలిపించాలంటే ఈటలకు ఓటు వేయాలని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, యాదగిరిగౌడ్, అమర్‌నాథ్ గౌడ్, పుర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో కొప్పుల ప్రచారం

వనస్థలిపురం: మల్కాజిగిరి అభివృద్ధి చెందాలంటే బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్‌లోని చిత్రసీమకాలనీ, జడ్జెస్‌కాలనీ, శుభోదయకాలనీ, విజయశ్రీకాలనీ, వివేకానందనగర్ కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి ఈటలను గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఈటలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ రౌండ్ నుంచే బీజేపీకి ఆధిక్యత ఖాయం

● చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా

● బడంగ్‌పేట్ మునిసిపల్ గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్

సరూర్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల లెక్కింపు రౌండ్ నుంచే బీజేపీకి స్పష్టమైన ఆధిక్యత లభించనున్నదని, అదే ఆధిక్యత చివరి రౌండ్‌దాకా కొనసాగనున్నదని బీజేపీ చేవెళ్ల నియోజకవర్గం అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మునిసిపల్ ప్లే గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్ చేసి, వాకర్స్‌తో ముచ్చటించారు. వారితో కలిసి పుట్‌బాల్, వాలీబాల్ ఆడి అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90శాతానికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు బీజేపీ వైపు ఉన్నారని, పోస్టల్ బ్యాలెట్‌లోనే ఇది తేటతెల్లమయిందని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ ఈ ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటేసి బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి, బీజేపీ మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, నర్సింహ, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ మునిసిపల్ గ్రౌండ్‌లో వాకర్స్‌ను కలిసి విజయ సంకేతం చూపుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

కమలం పువ్వు గుర్తుకు ఓటెయ్యండి

ఎల్బీనగర్ : మే 13న జరుగనున్న ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చేవెళ్ల ఎంపీగా గెలిపించాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ ఓటర్లను కోరారు. బుధవారం సరూర్‌నగర్ డివిజన్‌లోని జేబీకాలనీ, డాక్టర్స్‌కాలనీ, క్రాంతినగర్, వికాస్ నగర్ కాలనీలలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. భారతదేశ భవిష్యత్తు, భద్రత కోసం నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కోకన్వీనర్ జైన్‌బాబు, నాయకులు సాతెల్లి సాయి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పసుమాములకు చెందిన బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేత చెవుల మణికిరణ్ బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి వందలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవి, చిట్టి రాజుగౌడ్, శంకరయ్యగౌడ్, నర్సింహ, రామలింగం, దర్శన్ పాల్గొన్నారు.

గుర్రంగూడలో కారు బీభత్సం

● ద్విచక్ర వాహనంతో పాటు విద్యుత్ స్తంభానికి ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

సరూర్‌నగర్: మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుర్రంగూడలో మంగళవారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. ఓవర్ స్పీడ్‌తో వచ్చిన కారు ఓ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టి, అనంతరం రోడ్డు పక్కన గల విద్యుత్ స్తంభాన్ని సైతం బలంగా ఢీకొట్టడంతో సదరు స్తంభం మూడు ముక్కలై నేలకొరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గుర్రంగూడకు చెందిన ఇమ్మిడి జ్ఞానేశ్వర్(24) అనే యువకుడు మంగళవారం రాత్రి సిటీ నుంచి వచ్చిన తన సోదరుడిని తీసుకురావడానికి గాను ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి సాగర్ రోడ్డులోని గుర్రంగూడ బస్టాప్‌కు బయలుదేరాడు. ఇంటి నుంచి రోడ్డు పైకి రాగానే అక్కడి చిన్న మూల మలుపు వద్ద సాగర్ రోడ్డు వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన కారు అదుపు తప్పి ద్విచక్ర వాహనదారుడిని బలంగా ఢీకొట్టింది. అదే స్పీడులో వెళ్లి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని సైతం ఢీకొట్టి బోల్తా పడింది. కారు వేగానికి బెలూన్లు తెరుచుకోగా, విద్యుత్ స్తంభం నేలకొరిగి మూడు ముక్కలయింది. ఈ సంఘటనలో జ్ఞానేశ్వర్‌కు తీవ్రగాయాలు కాగా వెంటనే స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా కారులో ఉన్న ఇద్దరు యువకులకు స్వల్ప గాయాలు కాగా, ప్రమాదం జరుగగానే అక్కడి నుంచి జారుకున్నారు. వారు ఎవరనేది ఇంత వరకు తెలియరాలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. నిందితులు మద్యం మత్తులో కారు నడిపి ఈ ప్రమాదం చేసి ఉంటారని భావిస్తున్నారు. అర్ధరాత్రి వేళ వారు ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారు? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 8(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన షేక్ పర్వేజ్(40) స్థానికంగా ఉన్న అంజనేయస్వామి ఆలయం సమీపంలో పంక్చర్ షాపు నడిపిస్తున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు పంక్చర్ షాపుకు విద్యుత్‌వైర్లు తగిలాయి. రాత్రి 10గంటల సమయంలో షాపును మూసి వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెగిపడిన విద్యుత్ తీగ తగిలి బాలుడి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 8(ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులకు తెగిపడిన విద్యుత్ తీగ తగిలి 5ఏళ్ల బాలుడు మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూర్‌లో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ గ్రామానికి చెందిన ఆలకుంట జమ్ములయ్య ఏడాదిన్నర క్రితం హయత్‌నగర్‌లోని ముదిరాజ్‌బస్తీలో నివాసం ఉంటున్నారు. ఇతడు మున్సిపాలిటీ పరిధిలోని చెత్త సేకరణ చేస్తాడు. కాగా బుధవారం ఉదయం ఆటోలో తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి కుంట్లూర్ పరిధిలోని సన్‌రైజర్‌కాలనీ రోడ్డు నంబర్-3లో చెత్త సేకరణకు వెళ్లాడు. అతడి భార్య ఇళ్ల వద్ద చెత్తను సేకరిస్తుండగా ముగ్గురు పిల్లలతో ఆటోలో కూర్చున్నాడు. అదే సమయంలో అతడి కుమారుడు శివశంకర్(5) ఎల్‌కేజీ చదువుతున్నాడు. మూత్రం వస్తుందని పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశం వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ వైరు బాలుడి కుడి కాలుకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే బాలుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చాదర్‌ఘాట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మలక్‌పేట పోలీసులు బుధవారం మూసారాంబాగ్ పీవీఆర్ మాల్ ముందు గుర్తించారు. మలక్‌పేట ఎస్‌ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మూసారాంబాగ్ పీవీఆర్ మాల్ ముందున్న సబ్ రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లుగా స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈమేరకు పోలీసులు అతన్ని పరిశీలించగా మద్యం మత్తులోపడి ఉన్నాడు. వెంటనే చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడు 40 నుంచి 50ఏళ్ల వయస్సు ఉంటాడు. గ్రీన్ కలర్ చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. కేసును మలక్‌పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. యువకుడి మృతి

చంపాపేట, మే 8(ఆంధ్రజ్యోతి): అతివేగంతో వెళ్తున్న కారు గోడకు ఢీకొని బోల్తాపడిన సంఘటనలో యువకుడు మృతిచెందాడు. జిల్లెలగూడ కమలానగర్‌కు చెందిన విద్యార్థి ఏపవన్‌రెడ్డి(21) మంగళవారం రాత్రి తన స్నేహితులతో కలిసి జిల్లెలగూడలోని భాష్యం పాఠశాల గ్రౌండ్‌లో తన స్నేహితుడు కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలకు వెళ్లాడు. పుట్టినరోజు వేడుకలను జరుపుకున్న అనంతరం బుధవారం తెల్లవారుజామున సంతోష్‌నగర్‌లోని నాస్తా పాయింట్‌లో టిఫిన్ చేసేందుకు మిత్రులతో కలిసి పవన్‌రెడ్డి టీఎస్11యూబీ 2327కారులో బయలుదేరారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీఎంఆర్ఎల్ చౌరస్తా సమీపంలోని సాయిబాబా ఆలయం ఎదుట కారు అతివేగంతో వచ్చి ప్రహరీగోడకు ఢీకొని బోల్తా పడింది. కారువెనుక సీట్లో కూర్చున్న పవన్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక అపోలో డీఆర్‌డీఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు అతడిని పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. కారులో పవన్‌రెడ్డితో పాటు వంశీ డ్రైవింగ్ చేయగా ముకేష్ ముందు సీట్లో, సాయికుమార్, కళ్యాణ్ వెనుక సీట్లో కూర్చోవడంతో వారికి గాయాలయ్యాయి. మృతుడి అన్న తరుణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు.

రూ.12.56 లక్షల నగదు స్వాధీనం

చాదర్‌ఘాట్, మే 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా నగదు తరలిస్తున్న వాహనాన్ని మలక్‌పేట పోలీసులు పట్టుకున్నారు. మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్‌లోని రేడియంట్ సంస్థ ప్రైవేటు సంస్థల నుంచి నగదు సేకరించి బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల కమిషన్ అనుమతితోనే నగదును తరలించాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషన్ అనుమతితో మంగళవారం రాత్రి రేడియంట్ సంస్థ రూ.1.39కోట్ల నగదుకు గాను అదనంగా ఒక వాహనంలో రూ.6లక్షలు, మరో వాహనంలో రూ.6,56,635లక్షల నగదును తీసుకెళ్తుండగా మలక్‌పేట పోలీసులు ఆస్మాన్‌ఘడ్‌లో జరిపిన తనిఖీల్లో బయటపడింది. ఈ మేరకు రెండు వాహనాలను, రూ.12,56,635 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు మలక్‌పేట ఎస్‌ఐ జయంత్ తెలిపారు.